# కరీంనగర్ అప్పుడెట్లుండె.. ఇప్పుడెట్ల మారింది



ప్రచారంలో విల్లు ఎక్కుపెట్టిన మంత్రి గంగుల

- నగరంలో జరిగిన అభివృద్ధిపై ప్రజలు ఒక్కసారి ఆలోచన చేయాలి
- కాంగ్రెస్ టికెట్ కోసం అర్రసు పాడుతున్నరు
- బీఆర్ఎస్ కరీంనగర్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్
- 9, 11, 32వ డివిజన్లలో ఇంటింటా ప్రచారం

కార్పొరేషన్, నవంబర్ 4: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందు కరీంనగర్ ఎలా ఉండేది? ఈ పదేళ్ల కాలంలో నగరం ఏ స్థాయిలో అభివృద్ధి చెందిందో ప్రజలు గమనించాలని బీఆర్ఎస్ కరీంనగర్ అభ్యర్థి, రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ సూచించారు. శనివారం సాయంత్రం నగరంలోని 9, 11, 32వ డివిజన్లలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంత్రి గంగులకు మంగళహారతులతో స్వాగతం పలికి.. తిలకందిద్ది మద్దతు ప్రకటించారు. రాంపూర్‌లోని పోచమ్మ ఆలయంలో మంత్రి గంగుల పూజలు చేశారు. అనంతరం ఆయా చోట్ల మంత్రి మాట్లాడుతూ, 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణను ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. పదేళ్ల కాలంలో నగరాభివృద్ధి కోసం రూ.వేల కోట్ల నిధులు తీసుకువచ్చి పనులు చేపట్టామన్నారు. నగరంలో ఎక్కడ కూడా మట్టి రోడ్డు అనేది కనిపించకుండా సీసీ రోడ్ల నిర్మాణం చేశామన్నారు. గతంలో గుంతల రోడ్లతో అవస్థలు పడ్డామని, ఇప్పుడు మాత్రం రోడ్లను అద్భుతంగా తీర్చిదిద్దామన్నారు. నగరంలో జరిగిన అభివృద్ధిపై ప్రజలు ఒక్కసారి ఆలోచన చేయాలన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ బీఫాం, టికెట్ కోసం అర్రసు పాట నడుస్తున్నదని ఎద్దేవా చేశారు. డబ్బులకు టిక్కెట్లు అమ్ముకునే సంస్కృతి కాంగ్రెస్‌లో ఉందని విమర్శించారు. డబ్బులు పెట్టి పార్టీ టిక్కెట్లు కొనుక్కునే వ్యక్తులు నగర ప్రజల కోసం ఏం చేస్తారో ఆలోచన చేయాలన్నారు. కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నించే వ్యక్తి అత్తగారింటికి పోయి వచ్చినట్లు జైలుకు పోయి వస్తాడని, 24 కేసులు ఉన్న వ్యక్తి, రౌడీషీటర్లకు టికెట్ ఇచ్చే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. అలాంటి పార్టీలకు ఓట్లు వేస్తే అభివృద్ధి, సంక్షేమం ఆగిపోతుందన్నారు. మంత్రిగా ఉన్నా కూడా తాను ఎప్పుడూ ప్రజల మధ్యలోనే ఉన్నానని తెలిపారు. ప్రజల సంక్షేమం, వారు కోరుకున్న తీరులో నగరాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశానని చెప్పారు. తనకు మరోసారి అవకాశం ఇస్తే కరీంనగర్‌ను రాష్ట్రంలోనే గొప్ప నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే మానేరు రివర్ ఫ్రంట్‌ను ఏడాదిలో పూర్తి చేస్తామన్నారు. దీంతో పాటు ప్రస్తుతం పురోగతిలో ఉన్న అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేసి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను దొంగల చేతుల్లో పెట్టవద్దన్నారు. కాంగ్రెస్ మాటలు నమ్మి ఓటు వేస్తే తెలంగాణలో సంపదను దోచుకుంటారని, తెలంగాణను ఆంధ్రలో కలిపేస్తారని హెచ్చరించారు. పచ్చగా మారుతున్న తెలంగాణలో చిచ్చు పెట్టి భవిష్యత్తు తరాల నోట్లో మట్టి కొట్టేందుకు కుట్రలు సాగుతున్నాయని హెచ్చరించారు. కాంగ్రెస్, బీజేపీ మాటలను నమ్మవద్దని, అభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం పాటుపడుతున్న బీఆర్ఎస్‌ను కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు ఐలేందర్‌యాదవ్, మర్రి భావన, ఆకుల నర్మద నర్సయ్య, నాయకులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



నగరంలోని 9వ డివిజన్‌లో మంత్రికి స్వాగతం పలికేందుకు మంగళ హారతులతో వచ్చిన మహిళలు

# ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చా



గురంలో మహిళలకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

- వెయ్యి కోట్ల నిధులు తెస్తా.. అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తా
- మీ బిడ్డగా ఆశీర్వదించండి.. అసెంబ్లీకి పంపండి
- బీఆర్ఎస్ హుజూరాబాద్ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట, నవంబర్ 4: 'ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చా. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నా. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీతో రూ.వెయ్యి కోట్ల నిధులు తెస్తా. అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తా. మీ బిడ్డగా ఆశీర్వదించండి. అసెంబ్లీకి పంపండి. ప్రజా వ్యతిరేక శక్తులైన కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే అరిగోస పడ్తం. రాష్ట్రంలో బీఆర్ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరు. ఏడుసార్లు గెలిచి, మంత్రిగా పనిచేసి.. ప్రజా సమస్యలను పట్టించుకోని వ్యక్తి మనకు అవసరమా..? ఆలోచించాలే.. ఒక్క అవకాశం ఇచ్చి చూడండి. ఇచ్చిన మాట తప్పితే మరోసారి మిమ్మల్ని ఓటు అడగ..' అని బీఆర్ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం ఆయన జమ్మికుంట మండలంలోని నగురం, నాగారం, వావిలాల, పాపక్కపల్లి, సాయంత్రం మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెం(9,10,11 వార్డులు)లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రచార కార్యక్రమాల్లో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎన్నికల తర్వాత అర్హులందరికీ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. తాను గెలిచిన వెంటనే వావిలాలను మండలంగా చేసి తీరుతారని స్పష్టం చేశారు. జమ్మికుంట మున్సిపల్ ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి చేశామని, రానున్న రోజుల్లో మరో సిద్దిపేటగా మారుస్తానని హామీ ఇచ్చారు. నాయిని చెరువును పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేస్తానని, జమ్మికుంట చుట్టూ ఔటర్ రింగ్‌రోడ్డుకు కృషి చేస్తానని తెలిపారు.

### అమ్ముడు పోయిన నేతలను తరిమికొట్టండి

బీఆర్ఎస్ కండువా మీద గెలిచిన నాయకులు కొందరు ఇతర పార్టీలకు అమ్ముడు పోతున్నారని, పార్టీకి ద్రోహం చేసిన నాయకులను ఊళ్లోకి రానివ్వకుండా తరిమికొట్టాలని కౌశిక్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను, నాయకులను కోట్లు పెట్టి కొనుగోలు చేసేందుకు ప్రతిపక్షాలు రంగం సిద్ధం చేశాయని ఆరోపించారు. సీఎం కేసీఆర్ బొమ్మపై గెలిచిన జడ్పీటీసీ శ్యాం ప్రజలకు సేవెలా చేస్తారని ప్రశ్నించారు. పైసల కోసం పార్టీలు మారుతున్న నాయకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. అంతకు ముందు పాడి ప్రచారం సందర్భంగా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, నాయకుల ఆధ్వర్యంలో ప్రజలు ఘన స్వాగతం పలికారు. ప్రచార కార్యక్రమాల్లో డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్, వైస్ ఎంపీపీ తిరుపతిరావు, రైతు బంధు సమితి అధ్యక్షుడు లింగారావు, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, నాగారం, నగురం, వావిలాల, పాపక్కపల్లి గ్రామ సర్పంచులు రాజ్‌కుమార్, పద్మ-రాజేశ్వర్‌రావు, శ్రీలత-సత్యం, మహేందర్, ఎంపీటీసీ మర్రి మల్లేశం, 9,10,11వ వార్డు కౌన్సిలర్లు రాము, విజయలక్ష్మి-మల్లయ్య, కళావతి-మోహన్, గ్రామశాఖ, వార్డుల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



నవాబ్‌పేట్‌లో మాట్లాడుతున్న హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్

# అభివృద్ధిని చూసి ఓటేయండి

- స్వపరిపాలనలో ఆదర్శంగా పల్లెలు
- బీఆర్ఎస్ హయాంలోనే అద్భుత ప్రగతి
- కాంగ్రెస్‌కు ఓటేస్తే కటిక చీకట్లే
- హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్
- చిగురుమామిడి మండలంలో ప్రచారం

చిగురుమామిడి, నవంబర్ 4: స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అభివృద్ధిని పరుగులు పెట్టించడంతోపాటు గడపగడపకూ సంక్షేమ పథకాలను చేర్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ కొనియాడారు. సమైక్య పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధి కుంటుపడిందని, అన్ని వర్గాలు అనేక కష్టాలు అనుభవించాయని గుర్తు చేశారు. నాటికి, నేటికి తేడాను గమనించాలని, అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. తప్పిదారి కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కటిక చీకట్లు తప్పవని, రైతులు కష్టాలు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. చిగురుమామిడి మండలంలోని నవాబుపేట, గాగిరెడ్డిపల్లి, బొల్లోనిపల్లి, మకుటంపల్లి, గునుకులపల్లె, ఓగులాపూర్, ఇందుర్తి, లంబాడిపల్లి, సీతారాంపూర్ గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేయాలంటూ గ్రామస్తులను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల సతీశ్‌కుమార్ మాట్లాడారు. స్వపరిపాలనలో పల్లెలు వికసించేలా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని, బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో అద్భుతమైన అభివృద్ధి జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ కాళేశ్వరం జలాలతో చిగురుమామిడి మండలాన్ని సస్యశ్యామలం చేశారని కొనియాడారు. ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లినవారు తిరిగొచ్చి వ్యవసాయం చేసుకోవడం సంతోషకరమన్నారు. ఆయనవెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కర్ర శ్రీహరి, ఎంపీపీ కొత్త వినీత, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సుంకె రవిశంకర్

# బీఆర్ఎస్‌తోనే సమగ్ర అభివృద్ధి

- బీఆర్ఎస్ చొప్పదండి అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- 4, 5, 6వ వార్డుల్లో ప్రచారం

చొప్పదండి, నవంబర్4: బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమని ప్రజలు భావిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ప్రజలంతా బీఆర్ఎస్‌వైపే ఉన్నారని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. చొప్పదండి మున్సిపల్ పరిధిలోని 4,5,6వ వార్డుల్లో ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డుల్లోని ప్రతి గడపగడపకూ తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజలకు వివరిస్తూ, ఎన్నికల మ్యానిఫెస్టోపై అవగాహన కల్పిస్తూ ఓటు అభ్యర్థించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రూ.100 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయించి చొప్పదండి పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నానని చెప్పారు. తనను ప్రజలు ఆదరించి మరోసారి గెలిపిస్తే సేవకుడిలా పనిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం చొప్పదండి బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ప్రచారంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ఎంపీపీ చిలుక రవీందర్, జడ్పీటీసీ మాచర్ల సౌజన్య-వినయ్, సింగిల్‌విండో చైర్మన్లు వెల్మ మల్లారెడ్డి, మినుపాల తిరుపతిరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి, వైస్‌చైర్మన్ చీకట్ల రాజశేఖర్, మాజీ ఎంపీపీలు గుర్రం భూమారెడ్డి, వల్లాల కృష్ణహరి, మాజీ జడ్పీటీసీ ఇప్పనపల్లి సాంబయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్, మాజీ వైస్ చైర్మన్ కొత్తగంగారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు లోక రాజేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్లు మాడూరి శ్రీనివాస్, మహేశుని సంధ్య-మల్లేశం, వడ్లూరి గంగరాజు, సర్పంచులు పెద్ది శంకర్, విద్యాసాగర్‌రెడ్డి, గుంట రవి, వెల్మ నాగిరెడ్డి, చిలుక లింగయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ కొత్త గంగారెడ్డి,మండల కోఆప్షన్ పాషా, నాయకులు బందారపు అజయ్‌కుమార్‌గౌడ్, వెంకటరమణారెడ్డి, నారాయణరావు, గాండ్ల లక్ష్మణ్, పెద్దెల్లి అనిల్, రాపెల్లి ఐలయ్య, పంతంగి ప్రభాకర్, గుర్రం హన్మంతరెడ్డి, కొత్తూరి నరేశ్, నేరెళ్ల అంజయ్య, మహిళలు పాల్గొన్నారు.